విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 25 ఏప్రిల్ 2025 8 పేజీలు

పాలకుల నిర్లక్ష్యం అధికారుల అలసత్వం

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

విశాలాంధ్ర-దొనకొండ: మండల కేంద్రమైన దొనకొండలో లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పాలకుల నిర్లక్ష్యానికి, అధికారుల అలసత్వానికి నిదర్శనంగా దర్శనమిస్తున్నాయి. ప్రజా ధనంతో నిర్మించినప్పటికీ ప్రజా సేవకు ఉపయోగ పడకపోగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ఈ భవనరులు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి. వసతులు లేక పలు చోట్ల ఇబ్బందులు పడుతుంటే ఉన్న వాటిని వినియోగించలేక వదిలేసిన దుస్థితి నెలకొంది.

పంచాయతీరాజ్ అతిథి గృహం: 1998వ సంవత్సరంలో జిల్లా పరిషత్ రూ.20 లక్షల నిధులతో నిర్మించిన పంచాయతీ అతిథి గృహం ప్రారంభించక ముందే నేడు శిథిలావస్థకు చేరింది. వాడుకలో లేకపోవడంతో సుమారు 26 ఏళ్ళు గడిచే సరికి ప్రహరీ గోడ పడిపోయింది. గతంలో హౌసింగ్ సిబ్బంది సిమెంట్ గోడౌన్‌గా, విద్యాశాఖ కార్యాలయంగా ఉపయోగించుకున్నారు. 2011లో దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులు రూ.2 లక్షలతో అతిథి గృహానికి మరమ్మతులు చేయించారు. దొనకొండకు విచ్చేసే ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్థానిక రైల్వే గెస్ట్‌హౌస్‌లో కాలం వెలిబుచ్చుకుని వెళ్ళిపోతున్నారు.

హోమియో వైద్యశాల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 2015లో రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన హోమియో వైద్యశాల వైద్యుడు లేక ప్రారంభానికి నోచుకోక మూతపడి నిరుపయోగంగా మిగతా 2 లో ...

జగన్ టార్గెట్‌గా టీడీపీ కుట్రలు

- పాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే నాటకాలు
- వైసీపీ నేతలపై అక్రమ కేసులు
- ఆదాయ వనరుగా లిక్కర్‌ని మార్చుకుంటున్న తెలుగు తమ్ముళ్ళు
- లిక్కర్ యాజమాన్యాలు నుండి లంచాలు వసూళ్లు
- ఎమ్మెల్యేలకు, ఎంపీలకు వాటాలు
- వైసీపీ ఒంగోలు నియోజక వర్గం ఇంఛార్జి చుండూరి రవిబాబు ధ్వజం

విశాలాంధ్ర -ఒంగోలు : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను టార్గెట్ చేసి కూటమి ప్రభుత్వం ఇంఛార్జి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందని వైసీపీ ఒంగోలు నియోజక వర్గం ఇంఛార్జి చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యానికి ఆద్యం పోసింది చంద్రబాబు నాయుడు హయాంలోని అని పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపానం నిషేధం పేరుతో ఎన్నికలలో గెలిచిన వెంటనే మిగతా 2 లో ...

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి 2 లో..

ఎస్టీల గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయం

కలెక్టర్‌తో చర్చించిన న్యూఢిల్లీ హెచ్ఎఫ్‌హెచ్ఐ బృందం

విశాలాంధ్ర - బాపట్ల : ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద లబ్ధిదారులైన ఎస్టీల గృహ నిర్మాణాలకు ఆర్థిక సహాయం అందించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన హాబిటాట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా బృందం గురువారం బాపట్ల జిల్లాకు చేరుకుంది. కలెక్టర్‌ని స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బృందం మర్యాద పూర్వకంగా కలిసి చర్చించింది. సమాజంలో దారిద్యరేక దిగువన ఉన్న ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం గూడు కల్పించడం సంతోష దాయకమని కలెక్టర్ చెప్పారు. ఆర్థిక స్తోమత లేక చాలామంది అర్ధాంతరంగా గృహ నిర్మాణాలను నిలిపివేసిన విషయాలను బృందంతో కలెక్టర్ చర్చించారు. అత్యంత నిరుపేదలకు ప్రభుత్వం సహాయ అందిస్తున్న ప్పటికీ నగదు లేక కొందరు అర్ధాంతరంగా నిర్మాణ పనులను నిలిపివేశారని వివరించారు. అలాంటి నిరుపేదలకు మీ వంతు ప్రోత్సాహం అందించాలని కోరారు. అత్యంత నిరుపేదలైన ఎస్టీల గృహ నిర్మాణాలకు మా సంస్థ నుంచి సహాయ సహకా రాలు అందిస్తామని హాబిటాట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా డైరెక్టర్ జస్టిన్ జెబాకుమార్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి భూముల పరిశీలన

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి నియోజకవర్గంలో అబ్దుల్ కలాం పేరుతో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 2018లో మంజూరు చేసింది. త్రిబుల్ ఐటీ ఏర్పాటుకు మండలంలోని దూబగుంట్ల వద్ద ఉన్న భూములు అనుకూలంగా ఉన్నాయని ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారులు గుర్తించారు. దీంతో ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు వద్దశంకుస్థాపన చేయడం జరిగింది. 2019లో ప్రభుత్వం మారడం, అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం త్రిబుల్ ఐటీ గురించి పట్టించుకోకపోవడంతో మరుగున పడింది. 2024లో కనిగిరి శాసనసభ్యునిగా ఎన్నికైన డాక్టర్ ముక్క ఉగ్ర నరసింహారెడ్డి రెడ్డి నియోజక వర్గంలో త్రిబుల్ ఐటీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. కనిగిరి నియోజక వర్గంలోనే త్రిబుల్ ఐటీ ఏర్పాటు చేయుటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబులను మిగతా 2 లో ...

నల్ల బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

- గత ఏడాది ధరలకే కొనుగోలు చేయించాలి
- క్వింటాకు రూ.15 వేలు మద్దతు ధర ఇవ్వాలి
- పొగాకు బోర్డు పరిధిలోకి తీసుకురావాలి
- కార్పొరేట్ దోపిడీ నుంచి కాపాడాలి
- మొదట్లో సాగును ప్రోత్సహించి, ఇప్పుడు అధిక సాగు అని చెప్పటం దుర్మార్గం
- ప్రభుత్వ హామీని వెంటనే అమలు చేయాలి
- లేని పక్షంలో మే 5న 'చలో సీఎం' నిర్వహిస్తాం
- సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రంలో నల్ల బర్లీ పొగాకు కు గిట్టుబాటు ధర కల్పించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు డిమాండ్ చేశారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో గురువారం సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నల్ల బర్లీ పొగాకు రైతుల పట్ల వ్యాపారులు దుర్మార్గంగా వ్యవహరించి దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గతేడాది నల్లబర్లీ పొగాకును సరాసరిన రూ. 15 వేలుకు కొనుగోలు చేస్తే, ఈ ఏడాది మాత్రం కేవలం రూ. మూడు నుండి నాలుగు వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే అధిక విస్తీర్ణంలో సాగు చేశారని, అంతర్జాతీయంగా బర్లీ పొగాకు డిమాండ్ లేదని మిగతా 2 లో ...

కడపలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర-కనిగిరి : ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల ఏప్రిల్ 26,27,28 తేదీలలో కడప నగరంలో జరుగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు సిహెచ్ పవన్ కళ్యాణ్ గురువారం స్థానిక దరిశి చెంచయ్య భవనం నందు నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ సమావేశంలో తెలిపారు. అనంతరం శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ఈ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని పేర్కొన్నారు. విద్యను పూర్తిగా కాషాయకరణ చేసే పద్ధతుల్లో బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని దేశ స్వతంత్రం కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధుల చరిత్రను తీసివేసి, బ్రిటీష్ వారికి తొత్తుగా పనిచేసిన వారి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడాన్ని ఏఐఎస్ఎఫ్ తరఫున ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్య, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కళ్ళు బుల్లి మాటలు చెప్పి గద్దెనెక్కి 10 నెలలైనా విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకు 15వేల రూపాయలు ఇస్తామని తెలిపిన ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటే మరిచిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటీకి భూముల పరిశీలన

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఒప్పించారు. గురువారం అబ్దుల్ కలాం ట్రిపుల్ ఐ.టి విద్య సంస్థ నిర్మాణం కొరకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నేతృత్వంలో బల్లిపల్లి, దుబాగుంట పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములను ట్రిపుల్ ఐ.టి. విద్య సంస్థ డైరెక్టర్ భాస్కర్ పటేల్ పరిశీలించారు. మండల రెవెన్యూ తహశీల్దార్ బి.వి రమణారావు, మండల అభివృద్ధి అధికారి యల్. బ్రహ్మయ్య గార్లు, పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, గ్రామ టిడిపి అధ్యక్షులు దయిండె శంకర్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, ఒంగోలు పార్లమెంటు టిడిపి కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పందికి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం..అధికారుల అలసత్వం

(మొదటిపేజీ తరువాయి)

మారింది. 2012 నుండి హోమియో వైద్యుడు లేక ప్రజలు యర్రగొండపాలెం, మార్కాపురం, నరసరావుపేట తదితర దూర ప్రాంతాలకు హోమియో వైద్యం నిమిత్తం వెళ్తున్నారు.

ఎంఆర్సీ భవనం: విద్యాశాఖ కార్యకలాపాల నిమిత్తం 1998 సంవత్సరంలో భవనం కొరకు రూ.3 లక్షల మండల గ్రాంటు నిధులతో పనులు ప్రారంభించి, శ్లాబు వరకు గోడలు నిర్మించాక, నిధులు సరిపోవంటూ చేతులెత్తేశారు. మరలా 2002లో అదనంగా రూ.2.20 లక్షలు మంజూరు కావడంతో పనులు ప్రారంభించి శ్లాబు వేసి వదిలివేశారు. 2006లో మండల గ్రాంటు రూ.2 లక్షల నిధులతో భవనానికి సిమెంట్ ప్లాస్టింగ్, తలుపులు, కిటికీలు బిగించి తిరిగి అసంపూర్తిగా వదిలేశారు. కొంత కాలం బహిర్భూమిగాను, బియ్యం నిల్వ చేసుకునేందుకు గిడ్డంగిగాను, మరి కొంత కాలం గృహ నిర్మాణ లబ్దిదారులకు సిమెంట్ పంపిణీ చేసే గిడ్డంగిగాను ఉపయోగపడింది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉండటంతో శిథిలావస్థకు చేరింది.

పౌర సరఫరాల గిడ్డంగి: కురిచేడు రోడ్డులో నాలుగేళ్ళ క్రితం దాదాపు కోటి రూపాయల వ్యయంతో భారీ గోడౌన్ల సముదాయం (ఎంఎల్ఎస్ పాయింట్) నిర్మించారు. దీంతో ఎస్సీ బాలుర వసతి గృహం ఎదురుగా ఉన్న పాత గిడ్డంగిని ఖాళీ చేసి నూతన గిడ్డంగిలోనే రేషన్ సరుకులు నిల్వ చేస్తున్నారు. దీంతో పాత గిడ్డంగి, సీసీ కెమెరాలు ఏళ్ళ తరబడి నిరుపయోగంగా దర్శనమిస్తుంది.

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోండి

- ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వినతి

విశాలాంధ్ర - మార్టూరు : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గ్రానైట్ పరిశ్రమ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందని, గ్రానైట్ పరిశ్రమ తీవ్ర సంక్షోభానికి గురైందని గ్రానైట్ పరిశ్రమకు అండగా నిలిచి ఆదుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో గ్రానైట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరితో కలిసి నేతలు గ్రానైట్ సమస్యలపై చర్చించారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా వినతి పత్రంలో అంశాలను మంత్రికి ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్న సమయంలో స్లాబు సిస్టం ప్రారంభ సమయంలో కలర్ గ్రానైట్ కి 22 క్యూబిక్ మీటర్స్‌కు రాయల్టీ గెలాక్సీ సమానంగా రూ.27,000లు నిర్ణయించి వసూలు చేస్తున్నారన్నారు. కానీ రాష్ట్రమంతా కలర్ గ్రానైట్‌కి రూ.22,000లు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లా గ్రానైట్ పరిశ్రమల వారికి 22 మీటర్లకు రూ.22,000లు వసూలు చేసే విధంగా ఉత్తర్వులు జారీ చేసి పరిశ్రమను ఆదుకోవాలన్నారు. గ్రానైట్ పలకలు విక్రయించే సమయంలో గ్రానైట్ పలకల కొలతలు వేసే క్రమము నందు పొడవు నందు 6 వెడల్పు నందు 3 అంగుళాల చొప్పున అలవెన్సు (భత్యము) ఇచ్చుట ఆనవాయితీడా ఉందన్నారు. గ్రానైట్ పలకల రవాణా చేసే సమయంలో ఈ అలవెన్సును కూడా డిపార్ట్మెంట్ వారు (మైనింగ్ జీయస్టీ) పరిగణనలోకి తీసుకొని భారీగా అపరాధ రుసుములు వేస్తున్నారన్నారు. టన్నుకు 140 లేక 150 అడుగులు వస్తుంది. వీటిలో ఏదో ఒక విధముగా డిపార్టుమెంటు వారికి తగు ఉత్తర్వులు ఇప్పించి మా ఇబ్బందులు తొలగించాలన్నా రన్నారు. ప్రస్తుతము స్లాబు సిస్టం నందు రాయల్టీ చెల్లించిన తరువాత ఆ నెల చివరి వరకు మాత్రమే బ్లాకులు రవాణా చేసుకొనుటకు మాకు గడువు ఉందని వివరించారు. ఒక్కొక్కసారి వాతావరణము వల్ల కానీ లారీలు కొరత వల్ల కానీ నిర్ణయించిన గడువులో మేము బ్లాకులు రవాణా చేసుకోపోవటం వలన రాయల్టీ వ్యర్థం అవుతుందన్నారు బ్లాకులు రవాణా చేసుకొను గడువు కనీసం 3 నెలలుగా పొడిగించాలన్నారు. గత 10 సంవత్సర కాలం నుండి గ్రానైట్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెంది పరిశ్రమలు బాగా ఏర్పడ్డాయని నూతన మల్టీ కటర్స్ వచ్చి ఉన్నాయన్నారు.

నల్ల బర్లీ పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

మోసపూరిత మాటలను చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక విస్తీర్ణంలో సాగు చేయమన్నది కార్పొరేట్ తొత్తులే కదా అని ప్రశ్నించారు. సమావేశానికి అతిథిగా హాజరైన నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో బర్లీ పొగాకును సాగు చేసింది అది శాతం మంది ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల కౌలు రైతులు అన్నారు. గతేడాది వచ్చిన ధరలను చూసి ఎక్కువ భాగం బలహీన వర్గాల పేదలు(రైతు కూలీలు) వ్యవసాయం రంగంలోకి వచ్చారన్నారు. కంపెనీ ప్రతినిధుల మాటలు నమ్మి అధిక విస్తీర్ణంలో, బంగారం తాకట్టు పెట్టి, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేస్తే, నేడు మార్కెటింగ్ సమయంలో అదే కంపెనీ ప్రతినిధులు అధిక విస్తీర్ణంలో సాగు చేశారనే నెపాన్ని రైతులు పైనే రుద్ది అతి తక్కువ ధరలకే బర్లీ పొగాకును కాజేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీల కుట్రలను రైతులు ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే వీరారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 26 నుండి 30 వరకు జిల్లాలోని ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, జిల్లా మంత్రులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని, ఆ తర్వాత బర్లీ పొగాకు సాగు చేస్తున్న రైతులను కలిసి, మే 5వ తేదీన చలో ముఖ్యమంత్రి కార్యక్రమానికి సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ లలిత కుమారి, ఉపాధ్యక్షులు పరిటాల కోటేశ్వరరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోడూరి హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు పంటలు చేతికి వచ్చి మార్కెటింగ్ చేసే సమయాలలో రైతుల పక్షాన కాకుండా, వ్యాపారుల పక్షాన నిలిచి రైతులను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను మోసం చేయడంలో కొంతమంది రైతు నాయకులు అని చెప్పుకునే వారు కూడా ఉండటం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వ్యాపారుల పక్షాన నిలుస్తుందో, రైతుల పక్షాన నిలిచి నల్ల బర్లీ పొగాకు గిట్టుబాటు ధర ఇప్పిస్తుందో తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమ రెడ్డి మాట్లాడుతూ బర్లీ పొగాకు సాగు రాష్ట్రంలో 9 జిల్లాలలో విస్తారంగా సాగు చేస్తున్నారన్నారు. వర్జీనియా పొగాకు కు ధీటుగా బర్లీ సాగు అవుతుందన్నారు. ప్రజా ప్రతినిధులకు విజ్ఞాపన పత్రాలు అందజేసే కార్యక్రమంలో, బర్లీ పొగాకు రైతులను కలిసి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో రెడ్ స్టార్ విప్లవ రైతు సంఘం నాయకులు భీమవరపు సుబ్బారావు, జిల్లా రైతు కూలీ సంఘం నాయకులు కోడూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్ టార్గెట్‌గా టీడీపీ కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

దానిని అమలు చేసిన వ్యక్తి అన్నారు. అయితే మధ్యలోనే పాలన చేపట్టిన చంద్రబాబు నాయుడు తన ఆరాధ్య మీడియా ద్వారా రాష్ట్రానికి మద్యం ఎంతో అవసరమని విష ప్రచారం చేయించారన్నారు. ప్రచారం చేయించడమే కాకుండా ఎక్కడో ఊరి బయట ఉన్న మద్యం షాపులను నడి ఊర్లలోకి తీసుకువచ్చి, బెల్ట్ షాపుల పేరు తో ప్రతి ఇంటి ముందుకు మద్యాన్ని తీసుకువచ్చింది చంద్రబాబు నాయుడు కాదా అని ప్రశ్నించారు. నేడు కొందరు మద్యం తాగి ఎక్కడ పడుకోవాలి కూడా తెలియక రోడ్ల పైన డివైడర్లపై ప్రమాదకర స్థితిలో పడుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగంలో ఉన్న దుకాణాలను మూసేసి, ప్రైవేటు వరకు కట్టబెట్టి, రాష్ట్రంలో విచ్చలవిడిగా జరుగుతున్న లిక్కర్ అక్రమాలను దాచేయటానికి, తెలుగుదేశం పార్టీ, ఓటమిలోని నాయకులు చేతులు లిక్కర్ మాఫియా చేస్తున్న భారీ అవినీతిని దాచిపెట్టడానికి వైయస్సార్సీపీ పై బురద చల్లి, దీనిపై పెద్ద ఎత్తున విష ప్రసాదం చేసి, తప్పుడు కేసులు పెట్టి, ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఇవి చేస్తూనే మరో వైపు దోచుకుంటున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. లిక్కర్ విషయంలో చంద్రబాబు చాలా వ్యవస్థీకృతంగా,అవినీతికి పాల్పడుతూ, మరోవైపు తమ విధానాల్లో అవినీతి లేదని, అంతా కరెక్ట్ గా జరుగుతోందని, తప్పులన్నీ గత ప్రభుత్వమే చేసిందన్న అభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నంలో భాగంగా, పెడుతున్నారన్నారు. అదే సమయంలో పైనుంచి కింద దాకా దోచుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్యంత కారణాలు మొత్తం కూటమి నాయకులకు, వారికి సంబంధించిన ముచ్చటకే వచ్చేలా వ్యవహారాన్ని నడిపారన్నారు. ఎవర్ని అప్లికేషన్లు కూడా పెట్టుకోనివ్వకుండా బెదిరించారన్నారు. ప్రైవేట్ దుకాణం నుండి 30% కమిషన్లు తీసుకుంటున్నారు అన్నారు. ఇవ్వని వారిపై ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. దుకాణాలన్నిటినీ టీడిపి నాయకుల ఆధీనంలో ఉన్న మాఫియా చేతుల్లోకి తీసుకువచ్చారన్నారు. ఏ బ్రాండ్ అంటానీ, ఎంతకు అమ్మాలి, నిర్ణయాలని లిక్కర్ మాఫియా చేతిలోనే అన్నారు. ప్రతి క్వార్టర్ పై రూ. 10 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందో చెప్పాలని ప్రశ్నించారు. వీలైనంత మేర లిక్కర్ అమ్మకాలు పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఒకవైపు మద్యం మాఫియాను నడిపిస్తూ, మరోవైపు వందల కోట్ల రూపాయలను తనకు తన పార్టీ నాయకులకు దోచిపెడుతూ ప్రజల దృష్టి తమపై పడకుండా వైయస్సార్సీపి హయాంలోని అత్యంత పారదర్శకంగా తీసుకువచ్చిన లిక్కర్ విధానం పై తప్పుడు కేసులు పెడుతూ, ఆ నీడలో మాఫియాను నడిపిస్తున్నారన్నారు. వైయస్ జగన్ ఎంతో పారదర్శకతతో మద్యం ను ప్రభుత్వ ఆధీనంలోనే నడిపారు అన్నారు. సమయపాలన పాటించారన్నారు. ప్రజలు మద్యానికి బానిసలు కానివ్వకుండా ధరలు పెంచారన్నారు. టిడిపి గత ఐదేళ్లలో చేసిన అవాస్తవ ఆరోపణలు, అభూత కల్పనలనే గుచ్చి గుచ్చి దర్యాప్తు నివేదికగా ప్రజల్ని తప్పు దారి పట్టించేందుకు బరి తెగించిందని స్పష్టమైనది అన్నారు. దర్యాప్తు పేరుతో సాధించింది శూన్యమని గ్రహించిన సిట్ ఏమి చేయలేక మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ రెడ్డి పేరును నివేదికలో ప్రస్తావించటం ద్వారా ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో వైసీపీ నాయకులు దుంపా చెంచు రెడ్డి , పాలడుగు రాజీవ్, దేవా, వేముల శ్రీకాంత్, పులుసు సురేష్, సయ్యద్ ఖాదర్, తన్నీరు కృష్ణ, షేక్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో

స్థానిక నాయకులు, నల్లగుంట్ల ఎంపీటీసీ చెన్నారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మండల నాయకులు మేడం జ్యోతి ఇంద్రారెడ్డి, వేల్పుల మహేంద్ర, పంకు రాజగోపాల పంకు రాజ కృష్ణ బొడ్డు పెద్ద రంగయ్య. ఎద్దుల సుబ్బారెడ్డి గ్రామ పెద్దలు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీపీలను అభినందించిన పంచాయతీరాజ్ కమిషనర్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని సికె కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమానికి ప్రకాశం జిల్లా నుండి కొనకనమిట్ల మండల ఎంపీపీ మారుబోయిన మురళీకృష్ణ జడ్పిటిసి సభ్యుడు దాసరి ఏడుకొండలు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మురళీకృష్ణ జడ్పిటిసి ఏడుకొండలును పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణ చైతన్య అభినందించారు.

ఇరుసల గుండం సర్పంచికి పురస్కారం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామ స్వరాజ్య సాధన సమితి సేవ వారి ఆధ్వర్యంలో గురువారం కొనకనమిట్ల మండలంలోని ఇరుసలగుండం గ్రామపంచాయతీ సర్పంచ్ గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారం అవార్డును ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఒంగోలు టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ చేతుల మీదుగా అవార్డు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు వీరభద్రా చారి పాల్గొన్నారు ఈసందర్భంగా గోపిరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

నరవ సర్పంచి బండికి నాయకత్వ సేవ పురస్కారం

విశాలాంధ్ర-గిద్దలూరు : మండలంలోని నరవ గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులకు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కారాన్ని గురువారం ఒంగోలులో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పర్యాటక శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ అందజేశారు. ఈ సందర్భంగా నరవ గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులను పలువురు అభినందించారు.

సిద్ధార్థ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని ముటుకుల గ్రామంలో గల సిద్ధార్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన జి.ఆదిలక్ష్మి 592 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అలాగే పి భార్గవ్ చౌదరి 591 మార్కులతో మండల స్థాయిలో సెకండ్, సిహెచ్ తేజశ్రీ రెడ్డి 590 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అభినందించారు. విద్యార్థుల చేత కేక్ కట్ చేయించారు. సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తలిదండ్రులు పాలొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠలో అన్నదానం

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా గురువారం అన్నదానం నిర్వహించారు. టిడిపి నాయకులు కీర్తిశేషులు పంకు గంగయ్య కుమారులు పంకు రాజగోపాల్, రాధాకృష్ణ, పంకు రాజమోహన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా గ్రామోత్సవం, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెన్నారెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి మేడమ్ జ్యోతింద్రారెడ్డి వేల్పుల మహేంద్ర సాంసంగ్ చంద్రుడు భక్తులు విరివిగా పాల్గొన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దొనకొండ: ఉపాధి కూలీలు ప్రమాద బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలంటూ మార్కాపురం క్లస్టర్ ఏపీడి నిర్మలాదేవి తెలిపారు. మండలంలోని గంగదేవిపల్లి, ఇండ్లచెరువు గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆమె గురువారం పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనలో రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షలు, ప్రధానమంత్రి జీవన జ్యోతి యోజనలో రూ.436 చెల్లిస్తే రూ.3 లక్షలు ప్రమాద బీమా పొందవచ్చన్నారు. రెండు రోజుల్లో దరఖాస్తులు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అందించాలన్నారు. వేసవిలో ఉదయాన్నే పనిలోకి వచ్చి రూ.307 కూలీ పడేలా పని చేయాలన్నారు. బుధవారం నుండి పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూలీల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వివరించారు. ఆమె వెంట ఏపీఓ కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచిగా ఖాదర్ బి బుజ్జి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని కోయిలంపాడు గ్రామ సర్పంచి షేక్ ఖాదర్ బి బుజ్జి ఉత్తమ సర్పంచిగా ఎన్నికయ్యారు. గత నాలుగు సంవత్సరాల నుండికాలంలో కోవిలంపాడు పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తీరుస్తూన్నా ఖాదర్ బి బుజ్జిని జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సందర్భంగా మండలంలో ఉత్తమ సర్పంచిగా అవార్డు రావడం జరిగింది. గురువారం జిల్లా కేంద్రంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక చైర్మన్ నూకసాని బాలాజీ, పంచాయతీరాజ్ వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శి వీరభద్రా చారి చేతుల మీదుగా షేక్ ఖాదర్ బి బుజ్జిని ఉత్తమ సర్పంచి అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర-కొమరోలు : మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, పంచాయతీల వ్యవస్థ అభివృద్ధి కొరకు పాటుపడిన వారిని గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాటిచర్ల ఎంపిటిసి సభ్యులు కామూరి శ్రీనివాస్ రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మస్తాన్ వలి పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలి

సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ

విశాలాంధ్ర - సింగరాయకొండ : గ్రామాల అభివృద్ధి సంక్షేమం గ్రామ సంపూర్ణ వికాసం సాధించాలంటే పంచాయితీ రాజ్ వ్యవస్థ బలోపేతం కావాలని దాని కొరకు గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది అంకిత భావం తో పని చెయ్యాలని సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ పిలుపు ఇచ్చారు. సింగరాయకొండ గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో అధికారులు ఏర్పాటు చేసిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ తాటి పర్తి వనజ

ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా గాంధీ పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు,సచివాలయాల సిబ్బంది గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొనాల్సి ఉంది. కారణాలు ఏమైనా జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం మాత్రం క్యాలండర్ కార్యక్రమంగా జరిగింది అని చెప్పవచ్చు. సర్పంచ్ వనజ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు గ్రామ రాజ్యాన్ని అందుబాటు లో ఉంచేందుకు సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. ప్రజలు రాజకీయ పార్టీలు, ఉద్యోగులు సిబ్బంది గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు తమ బాధ్యతలం తాము నిర్వహించాలని అప్పుడే గ్రామ పంచాయతీ వ్యవస్థ బలోపేతం అయ్యేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. కార్యక్రమం అనంతరం గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధి పడిదపు రవి చొరవ తీసుకుని జాతీయ విషాదం కాశ్మీర్‌లో ఉగ్రదాదుల చర్య తో మృతి చెందిన పర్యాటకుల మృతికి సంతాపం తెలిపారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్ రోడ్‌లో కొండను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : శ్రీశైలం ఘాట్ రోడ్ లో కొండను ఢీకొన్న ప్రైవేట్ బస్సు ఒకరికి తీవ్ర గాయాలు మరో 10 మందికి స్వల్ప గాయాలను సంఘటన మండలంలోని శ్రీశైలం ఘాట్ రోడ్‌లో చిన్నారుట్ల వద్ద గురువారం ఉదయం జరిగింది. అందిన సమాచారం మేరకు బళ్లారి నుండి శ్రీశైలం దైవదర్శనానికి వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పి కొండను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న దోర్నాల పోలీసులు హుటా హుటాన సంఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. గాయపడ్డ క్షతగాత్రులను సుండిపెంట ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - తాళ్లూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ దార హనుమంతరావు, డిప్యూటీ ఎంపీడీఓ సుందర రామయ్యల ఆధ్వర్యంలో జాతి పిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్టికల్ 73వ ఆర్టికల్ ద్వారా పంచాయితీలకు సర్వాధికారాలు వచ్చాయని దీంతో పంచాయతీల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అయిందని అన్నారు. అదేవిధంగా మండలంలోని పలు పంచాయితీలలో జాతీయ పంచాయితీ రాజ్ దినోత్సవంను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ ఎస్ఓ సానికొమ్ము సత్యం, తాళ్లూరు గ్రామ కార్యదర్శి ఐ.రమణా రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపాలెం మార్గంలో పూడిక తీత పనులు

విశాలాంధ్ర - తాళ్లూరు : కొత్తపాలెం-తాళ్లూరు మార్గంలోగల సైడు కాలువ పూడి పోయి మురుగు నీరు రోడ్డు అనుకుని ప్రవహిస్తూ బురదమయంగా మారటంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎక్సలేటర్‌తో పూడిక తీత పనులు చేపట్టారు. కొత్తపాలెం గ్రామం నుండి తాళ్లూరుకు వెళ్లే మార్గంలోని చెరువు వంకలోకి మురుగు నీరు ప్రవహిస్తుండగా కాలువపూడి పోయింది. దీంతో సాయి బాబా గుడి సమీపాన మురుగు నీరు రోడ్డు అనుకుని ప్రవహిస్తూ దుర్గంధం వెద జల్లుతున్నది. పలువురు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుక వెళ్లారు. ఎంపీడీవో దారా హనుమంతరావు ఆదేశానుసారం గ్రామసర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి ఐ.వి.రమణారెడ్డిలు పంచాయతీ నిధులతో పూడిక తీత పనులు చేయించి రోడ్డుపై మురుగు నిల్వుండకుండా చర్యలు చేపట్టారు.

'పది' పరీక్షల్లో టౌన్ ఫస్ట్

విశాలాంధ్ర - కనిగిరి: మండల పరిధిలోని గుండ్లపాలెం గ్రామానికి చెందిన మాచిపల్లి మౌనిక బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. అత్యధిక మార్కులు సాధించిన మౌనిక గుండ్లపాలెం ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి కావడంతో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎం రమణారెడ్డి, షేక్ ఫయాజ్ అహ్మద్ భాష విద్యార్థిని మౌనికను అభినందించారు.

'పది' పరీక్ష ఫలితాల్లో ఎం.హెచ్.ఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కనిగిరి : బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో స్థానిక ఎం.హెచ్.ఆర్ పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని పాఠశాల యాజమాన్యం తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు మొత్తం 52 మంది విద్యార్థులు హాజరవ్వగా 590 మార్కులు సాధించిన విద్యార్థులు 4 గురు, 580 మార్కులు సాధించిన వారు 11 మంది, 550 మార్కులు సాధించిన వారు 29 మంది, అలాగే 500 మార్కులకు పైగా సాధించిన వారు 41 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఎం హెచ్ ఆర్ స్కూల్ కరస్పాండెంట్ యం హనుమంతరావు, స్కూల్ డైరెక్టర్ పాలారి వరుణ్ కుమార్ రెడ్డి అభినందించారు.

మహిళా సాధికారతే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యం

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : మహిళా సాధికారతే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ పైన ఉన్నటువంటి సచివాలయ భవనంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రాన్ని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. టీడీపీ ప్రభుత్వం మహిళా పక్షపాతి ప్రభుత్వమని సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేదింటి మహిళలు ఆర్థికంగా స్థిరపడాలనే ఉద్దేశంతో వారికి కుట్టు మిషన్ల శిక్షణా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని నేడు గిద్దలూరు నియోజకవర్గంలో ప్రారంభించటం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఒక్క హామీని నెరవేరుస్తామని దీపం పథకం ద్వారా ఇప్పటికే ఉచిత సిలిండర్లు అందచేస్తున్నామని, జూన్ నాటికీ ప్రతీ ఒక్కరికి తల్లికి వందనం ద్వారా ప్రతీ తల్లికి నగదును వారి అకౌంట్లలో జమ చేస్తామని, గత పాలకుల లాగా మాటల ప్రభుత్వం కాదని, చెప్పిన ప్రతీ పథకాన్ని అమలు చేసి తీరుతామన్నారు. గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంకు చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు, తాహసీల్దార్ ఆంజనేయ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, మండల, పట్టణ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ శానేశావలి పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అనుమతించాలి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : గతంలో జిల్లా మెడికల్ బోర్డుల ద్వారా జారీ చేసిన అంగవైకల్య సర్టిఫికెట్లు చెల్లవని వాటి ద్వారా బదిలీలలో ఎలాంటి పాయింట్లు ఇవ్వకుండా, ఆ ఉపాధ్యాయులను వెనక్కి తిప్పి పంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే జిల్లా మెడికల్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్లు కూడా అనుమతి ఇచ్చి వారికి న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ సిఎస్‌పురం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెవస్ ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ డిమాండ్ చేశారు. దాదాపు 15 సంవత్సరాల క్రితం జిల్లా మెడికల్ బోర్డుల ద్వారా జారీ చేయబడ్డ అంగవైకల్య సర్టిఫికెట్లు ఉన్న ఫలంగా చెల్లవని నిర్ణయించడం అన్యాయమని వారు తెలిపారు. వాటి ద్వారానే వారు ఉద్యోగంలో చేరాలని ప్రభుత్వం ఏ సందర్భంలోనూ వాటిని సదరం సర్టిఫికెట్లుగా మార్చుకోవాలని ఎలాంటి నిబంధన ఇవ్వలేదని, వారందరికీ ఇప్పటివరకు బదిలీల్లో స్పెషల్ పాయింట్ లు ఇచ్చారని ఇప్పుడు హఠాత్తుగా సర్టిఫికెట్లు తెచ్చుకోమంటే ఒక రోజులో ఎలా సాధ్యపడుతుందని వారు ప్రశ్నించారు. కాబట్టి ఈ ఒకసారి కి జిల్లా మెడికల్ బోర్డుల సర్టిఫికెట్లు అనుమతించాలని వారు కోరారు. వారికి కొంత సమయం ఇచ్చి ఆ సమయంలో సదరం సర్టిఫికెట్లు తెచ్చుకోవడానికి అవకాశం ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అంగ వైకల్య ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని వారు కోరారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో పెయింటింగ్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు బుధవారం శీలంవారిపల్లె గ్రామంలో పెయింట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు, కమ్యూనిటీ హాల్‌కి పెయింట్ వేసి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమం యన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఇన్చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

శీలంవారిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం శీలంవారిపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.నిఖిత రాణి ద్వారా గ్రామంలోని ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామ ప్రజలు,పెద్దలు, అభినందులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఇన్చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్య, ఏఎన్ఎం రమాదేవి, ఆషా వర్కర్స్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పహల్గామా ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : జమ్మూ కాశ్మీర్లోని పహల్గామ యాత్రికులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి చంపడాన్ని గిద్దలూరు పట్టణ బిజెపి అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ తీవ్రంగా ఖండించారు. గిద్దలూరు పట్టణం లో బుధవారం సాయంత్రం ఉగ్రమూకల దాడిలో మరణించిన వారికి సంతాప సూచకంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ శంకర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయాలని కోరారు. బిజెపి జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జెవి నారాయణ మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్ లో పర్యటక రంగం అభివృద్ధి చెందడాన్ని జీర్ణించుకోలేని పాకిస్థాన్ ఉగ్రవాదులను ప్రేరేపించి పర్యాటకులను చంపడం పిరికి పంద చర్యగా భావించారు. పాకిస్థాన్ పై తీవ్రమైన చర్యలు తీసుకోవడం ద్వారా ఉగ్రవాదానికి సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో హిందూ సంఘాల నాయకులు పోలంరెడ్డి బాలకృష్ణారెడ్డి, చేరెడ్డి ఎర్రారెడ్డి,శివపురం మురళీకృష్ణ, ఆర్ ఎస్ ఎస్ జిల్లా నాయకులు ఎస్ వి.కృష్ణారావు, బిజెపి నాయకులు ముప్పూరి శ్రీనివాసులు పలువురు హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత 'శక్తి యాప్'

విశాలాంధ్ర - బాపట్ల : శక్తి యాప్ వినియోగించడం వలన మహిళలకు మరింత భద్రత చేకూరుతుందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శక్తి యాప్ ఉపయోగాలు, అందులో నిక్షిప్తం చెయ్యబడిన సమాచారం వినియోగించు విధానం తదితర అంశాల గురించి మహిళలకు, విద్యార్థినిలకు జిల్లాలో విస్తృత అవగాహన కల్పించాలని శక్తి బృందాలను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం జిల్లాలోని శక్తి బృందాలు వారి పరిధిలోని కళాశాలలు, కోచింగ్ సెంటర్స్, వ్యాపార సముదాయాలు, మాల్స్, రైల్వే స్టేషన్‌లు, బస్టాండ్‌లు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు విద్యార్థినులకు శక్తి యాప్ గురించి వివరించి వారి మొబైల్‌లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకొనే విధంగా విస్తృత అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులలో మహిళల రక్షణకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ లలో మహిళల ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్ డెస్క్ పోలీస్ స్టేషన్లకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవడానికి ఇబ్బందిగా భావించే మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి సఖి వన్‌స్టాప్ సెంటర్ సేవల వినియోగం గురించి, అత్యవసర పరిస్థితులలో బాలబాలికలకు సంబంధించిన సమస్యలకు 1098, మహిళలకు సంబంధించిన సమస్యలకు 181, పోలీస్ శాఖను సంప్రదించేందుకు 100/112, సైబర్ నేరాలకు గురైతే సంప్రదించవలసిన 1930, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం అందించడానికి 1972 హెల్ప్ లైన్ నెంబర్ల గురించి శక్తి బృందాలు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - నిజాంపట్నం : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని గురువారం నిజాంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీ రాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని చెప్పారు. గ్రామ స్వపరిపాలన కోసం అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తేవడం కోసం పంచాయతీరాజ్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం డి.మస్తాన్ రావు, సీనియర్ అసిస్టెంట్ టి.లక్ష్మీ కాంతమ్మ, ఎంపీటీసీ నాజర్ ఖాన్, సర్పంచ్ కట్టా పోలేరమ్మ, పంచాయతీ కార్యదర్శులు రమేష్, జమీర్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ జాఫర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో చీరాల రైల్వే స్టేషన్ ప్రాంగణంలో చీరాల పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ యస్ సుబ్బారావు చేత చల్లటి మంచినీటి చలివేంద్రంను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎన్ సింగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, ప్రయాణీకుల దాహం తీర్చడానికి రోటరీ క్లబ్ ముందుకు రావడం అభినందించదగ్గ విషయం అన్నారు. మరెన్నో సేవాకార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. స్టేషన్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల 40 రోజులు మంచి నీటి చలివేంద్రాన్ని నిర్వహించడం వలన ప్రయాణికుల దాహార్తి తీర డమే కాకుండా అధికారుల ప్రశంసలకు పాత్రులవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్ బాబు, పోలుదాసు రామకృష్ణ, వంగర పూర్ణచంద్రరావు, మామిడాల శ్రీనివాసరావు, దోగుపర్తి వెంకట సురేష్, చీరాల కృష్ణమూర్తి, జి.వై.ప్రసాద్, రోటరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పండి

విశాలాంధ్ర - రేపల్లె : రెండున్నర సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్వాడి స్కూల్స్ కి ఐదు సంవత్సరాలు దాటిన బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకోవాలని జిల్లా అధికారిణి దోనకాడ రాధా మాధవి అంగన్వాడీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాధా రాణి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలు రోజు వారి అంగన్‌వాడీ కార్యక్రమాలు, చిన్నారుల పట్ల సమ్మర్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సూచనలు సలహాలు ఇచ్చారు. మే 2 నుండి జూన్ 10 వరకు కిశోరి బాలికలు నిర్వహించవలసిన కార్యక్రమాలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ సురేంద్ర, ప్రాజెక్ట్ అధికారిణి సుచిత్ర,సూపర్‌వైజర్లు ,సునీత,నాంచారమ్మ,రజని,శివ జ్యోతి, మంజుల ,వెంకటరత్నం,నాగలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆయాలకు జీతాలు పెంచాలి

ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ ముస్తఫా

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు ప్రతి నెల 1వ తేదీన రూ.16 వేలు జీతం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ ముస్తఫా తెలిపారు. సంతమాగులూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయావర్కర్స్ సమావేశం గురువారం షేక్ జాన్‌బీ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన షేక్ ముస్తఫా మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, బకాయిలు ఉంచకుండా ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఆయాలకు బీమా సౌకర్యం, గ్రాడ్ డ్యూటీ కల్పించాలని 60 సంవత్సరాలు దాటిన ఆయాలందరికీ పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ఆయాలందరూ సంఘటితంగా ఉండి యూనియన్ ఏర్పాటు చేసుకొని సమస్యల కోసం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలన్నారు నూతన కన్వీనర్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చెన్నుపల్లి బాలమ్మ, కో-కన్వీనర్లుగా తుపాకుల శ్రీలక్ష్మి, ఐతవరం రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో భాష,రాములు, జాన్వి, రమణమ్మ పాల్గొన్నారు.

ముస్లిం విద్యార్థులు విద్యలో రాణించాలి

అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీంజానీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ముస్లిం విద్యార్థులు విద్యారంగంలో రాణించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీమ్ జానీ తెలిపారు. గురువారం సాయంత్రం అంజుమన్ మసీదు ప్రాంగణంలో పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముస్లిం విద్యార్థిని విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు రహీమ్ జానీ మాట్లాడుతూ భవిష్యత్తులో తమ తల్లిదండ్రులు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థుల పురోగతికి బాటలు వేయాలన్నారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది జమీరుద్ భాష మాట్లాడుతూ చదువులో పదవ తరగతి అనేది తొలిమెట్టన్నారు. అంజుమన్ కమిటీ ముస్లింలకు చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు .డాక్టర్ మొహ మ్మద్ అజ్మతుల్లా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన షేక్ జహూరా 600 మార్కులు గాను 593 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారన్నారు. కమిటీ ఇదే స్ఫూర్తితో విద్యార్థులను చేయూత అందించాల న్నారు. అనంతరం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో 10 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముస్లిం విద్యార్థిని విద్యార్థులైన అమన్ అలీ ఖాన్, షేక్ షర్మిల, షేక్ ముస్కాన్ ,పఠాన్ లియాకత్ ఖాన్ ,షేక్ షబీనాలను దుస్సాలువ, పూల గుచ్చాలతో సన్మానించి ఒక్కొక్కరికి రూ రెండు వేల నగదు బహుమతి తో పాటు నిఘంటువులను బహూకరించారు .ఈ కార్యక్రమంలో కార్యదర్శి అబ్దుల్ కరీం, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు బాజీవలి,సభ్యులు అబ్దుల్ మజీద్, సత్తార్, ఖాసీం, షేక్ ఆదం,పెద్దలు షంషీ ఆజం, షేక్ ఆసిఫ్ ,జానీ, షేక్ సలీం, మహమ్మద్ ఖాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఎస్టీలు దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

విశాలాంధ్ర - బాపట్ల : ఎస్టీలు, దివ్యాంగుల కొరకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ప్రతినెల నాల్గో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ సమస్యలు విన్నవించుకోవడానికి జిల్లాలో దివ్యాంగులు, ఎస్టీలు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌కు రావచ్చున్నారు. ఈ విషయాన్ని జిల్లాలోని ఎస్టీలు, దివ్యాంగులు గమనించాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శిశువులకు అమ్మవడిగా 'ఊయల'

విశాలాంధ్ర - పర్చూరు : అభాగ్యులైన శిశ్యులకు అమ్మవడిగా ఊయల దోహదపడుతుందని సిడిపిఓ సుభద్ర తెలిపారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా ఊయాల కార్యక్రమం జరిగింది. అభాగ్యులైన శిశువులను వద్దు అనుకుంటున్న వారు బిడ్డను రోడ్డు ప్రక్కన వేయకుండ, బిడ్డను వద్దు అనుకున్న వారు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఊయలకు చేర్చాలని తెలిపారు. ఆ బిడ్డకు చట్టబద్ధమైన భద్రత కల్పించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సత్యదీప్తి, డాక్టర్ సౌమ్య, హెడ్ నర్సు రత్నకుమారి, సూపర్వైజర్లు దీపాదేవి, సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పెండెం ప్రత్యూష్‌కు యూపీఎస్సీలో 797వ ర్యాంక్



విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పట్టణానికి చెందిన డాక్టర్ పెండెం ప్రత్యూష్ యుపీఎస్సీ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఓపెన్ క్యాటగిరిలో 797 ర్యాంకు సాధించారు. బాపట్ల కేర్ డెంటల్ పెండెం సందీప్ సోదరుడు ప్రత్యూష్. ఈ నేపథ్యంలో ప్రత్యూష్‌ను కుటుంబీకులు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

శేషశాస్త్రి స్మారక సభను జయప్రదం చేయండి

12న బాపట్ల చీలురోడ్ సెంటర్‌లో స్మారక సభ

విశాలాంధ్ర - బాపట్ల : కామ్రేడ్ చివకుల శేషశాస్త్రి స్మారక సభను జయప్రదం చేయాలని కామ్రేడ్ శేషశాస్త్రి స్మారక కమిటీ సభ్యులు ప్రొపెసర్ విజయ్‌కుమార్; తన్నీరు సింగరకొండ, మేకల ప్రసాద్, గుదే రాజారావు, శరత్‌లు కోరారు. బాపట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ కామ్రేడ్ చివకుల శేషశాస్త్రి 1938వ సంవత్సరంలో దేశ స్వాతంత్ర్యం కోసం ఉప్పొంగిన యువజన విద్యార్థి ఉద్యమాలు శేషశాస్త్రిని కార్యోన్ముఖిన్ని చేశాయన్నారు. ఆ పోరాటాల్లో బ్రిటిష్ ప్రభుత్వం 18 నెలలు అతి దారుణ స్థితిలో ఆలీపూర్ సెంట్రల్ జైళ్ళో కామ్రేడ్ శేషశాస్త్రిని బంధించారన్నారు. 1942లో నరసరావుపేట ప్రజా పోరాటంలో ఆరు నెలలు జైలు శిక్షలో పోలీసుల హింసకి గురయ్యాడన్నారు.కామ్రేడ్ శాస్త్రి కమ్యూనిస్టు పార్టీలో చేరి, రైతు, కూలీ, యువజన, విద్యార్థి ఉద్యమాలకు ప్రాణం పోశాడన్నారు. 1948లో కమ్యూనిస్టు పార్టీ బాపట్ల ఆర్గనైజరుగా సుదీర్ఘ కార్యక్రమాలు రూపొందించాడు. కార్మికుల్నీ, కర్షకుల్నీ సంఘటితపరిచి తరతరాల నుండీ బానిసత్వంలో సతమతమయ్యే వాళ్ళకు చైతన్య స్పృహ కలిగించి వారి హక్కులూ, బాధ్యతల పోరాటాల్లోఅగ్రగామిగా నిలిచాడన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ బాపట్ల తాలూకా కార్యదర్శిగా ఉంటూ, దళితులు, గిరిజనులు, బుంగపోత కార్మికులు, పాకీపని వారు, అభ్యున్నతికీ, వారి సామాజిక హక్కుల కోసం అహోరాత్రులూ కృషి చేశాడన్నారు. నెహ్రూ, పటేల్ ప్రభుత్వం భారత కమ్యూనిస్టు పార్టీని నిషేధించినా ఉప్పరపాలెం ప్రధాన కేంద్రంగా ఏ ఒక్క కార్యక్రమం ఆగకుండా కార్యకలాపాలు నిర్వహించారన్నారు. దీనితో మలబార్ పోలీసులు ఒక వ్యక్తి యిచ్చిన సమాచారంతో శాస్త్రిని పట్టుకుని పోలీసు క్యాంపులో చిత్రహింసలు పెట్టి 1950 మే నెల 12వ తేదీన పెదనందిపాడు మండలంలోని పాలపర్రు గ్రామం చింతల తోపులో చెట్టుకి కట్టేసి అమానుషంగా కాల్చి చంపారన్నారు. నెహ్రూ, పటేల్ పాలనలో నేరారోపణ విచారణలు లేకుండానే తుపాకులతో కాల్చి, హత్య చేశారన్నారు. ప్రజా విముక్తి పోరాటంలో 31 సంవత్సరాల వయసులోనే తన జీవితాన్ని త్యాగం చేసిన విప్లవ యువయోధుడు కామ్రేడ్ శేషశాస్త్రి అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటున్న 77 సంవత్సరాల పాలనలో పేదలు నిరుపేదలవుతుంటే, కొంతమంది పాలకుల మద్దతుతో అతిగా సంపద దోపిడీ చేసి పోగేసుకుంటున్నారన్నారు.ప్రజల గౌరవ ప్రదమైన జీవనం కోసం నిరంతరం తపించిన కామ్రేడ్ శేషశాస్త్రి 75వ వర్ధంతి మే 12న కామ్రేడ్ శేషశాస్త్రి సెంటరులో (చీలు రోడ్డు సెంటరు) జరుగుతుందన్నారు. ప్రజల హక్కులకై ప్రాణాలర్పించిన అమరులను స్మరించుకుందామని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

ఎస్సై చంద్రావతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : శక్తియాప్‌తో మహిళలకు భద్రత చేకూరుతుందని బాపట్ల పట్టణ ఎస్సై చంద్రావతాతి తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు శక్తి యాప్ ఉపయోగాలపై పట్టణంలో విస్తృతంగా అవగాహన కల్పించారు. కళాశాలలు, కోచింగ్ సెంటర్స్, వ్యాపార సముదాయాలు, మాల్స్, రైల్వే స్టేషన్ లు, బస్టాండ్ లు ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు విధ్యార్ధినులకు శక్తి యాప్ గురించి వివరించి వారి మొబైల్ లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకొనే విధంగా విస్తృత అవగాహన కల్పించారు. మహిళలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి సఖి వన్ స్టాప్ సెంటర్ సేవల వినియోగం గురించి, అత్యవసర పరిస్థితులలో బాలబాలికలకు సంబంధించిన సమస్యలకు 1098, మహిళలకు సంబందించిన సమస్యలకు 181, పోలీస్ శాఖను సంప్రదించేందుకు 100/112, సైబర్ నేరాలకు గురైతే సంప్రదించవలసిన 1930, మత్తు పదార్ధాలకు సంబంధించిన సమాచారం అందించాడనికి 1972 హెల్ప్ లైన్ నెంబర్ ల గురించి శక్తి బృందాలు అవగాహన కల్పించారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

విశాలాంధ్ర - అద్దంకి : ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ కు గాయాలైన సంఘటన మండలంలోని కలవకూరు వద్ద గురు వారం ఉదయం జరిగింది. గోపాలపురం గ్రామానికి చెందిన సుబ్బయ్య ట్రాక్టర్‌తో కలవకూరు పోతుండగా మార్గమధ్యలో కలవకూరు చెరువు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ సుబ్బయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన సుబ్బయ్యను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. క్షతగాత్రుడు సుబ్బయ్యకు ఛాతిలో నొప్పి ఎక్కువగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అతనిని ఒంగోలు రిమ్స్కు తరలించారు.

హెల్పింగ్ హాండ్స్ నూతన కమిటీ ఎంపిక

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరులోని హెల్పింగ్ హాండ్స్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పఠాన్ ఖాదర్‌వలి, ఉపాధ్యక్షులు షేక్ బాషా,ప్రధాన కార్యదర్శి పుట్టా అయ్యప్ప స్వామి, కార్యదర్శి షేక్ రహిమా,గౌరవ అధ్యక్షులు కన్నగంటి శ్రీనివాసరావు,గౌరవ అధ్యక్షులు తగెడ్త ఆంజనేయులు,గౌరవ సలహాదారులు జె.జయరావు, గౌరవ సలహాదారులు శ్రీరామ్ వెంకట్రామయ్య, కమిటీ సభ్యులుగా కే. హరిబాబు, ఎస్.కె. హాబీబా,గుర్రం శ్రీను, బొల్లాపల్లి పౌలు, యం ఆంజనేయులు మాస్టారు,శిల్పాలు కోటేశ్వరరావు,ఏ రామారావు,షేక్ కాలేషా (జి. హెచ్. నగర్), పసుమర్తి కరీముల్లా, పఠాన్ బాషా, షేక్ రహేమాన్ (కోట డీలర్)లను ఎన్నుకున్నారు. హెల్పింగ్ హాండ్స్ సేవలు మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండవ సంవత్సరములో అడుగుపెట్టిన సందర్భంలో మార్టూరు, యద్దనపూడి మండలాలలో సేవలు అందించుటకు కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు.

వేట నిషేధ భృతికి ఈ-కేవైసీ చేయించుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మత్స్యకార వేట నిషేధ భృతికి లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని నిజాంపట్నం ఎఫ్డీఓ - 2 పి.సాయి సందీప్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు.మత్స్యకార వేట నిషేధ భృతికి సంబంధించి అర్హుల, అనర్హుల జాబితాలను సమీప గ్రామ సచివాలయాలలో, రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించడం జరిగిందన్నారు. కావున అర్హులైన వారు లబ్ధి పొందెందుకు ఈ నెల 24, 25 తేదీల్లో సమీప గ్రామ సచివాలయాలలో వేలిముద్ర వేసి ఈ-కేవైసీ చేయించుకోవాలని, ఈ-కేవైసీ చేయించుకొని వారు మత్స్యకార భృతి లబ్ధి పొందలేరన్నారు.గ్రామ సచివాలయాలలో ప్రదర్శించిన జాబితాలలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత పూర్తి ధృవ పత్రాలతో గ్రామ సచివాలయంలో అర్జీ నమోదు చేసుకోవాలని చెప్పారు.ఈ నెల 26న సీఎం నారా చంద్రబాబు నాయుడు మత్స్యకార వేట నిషేధ భృతిని లాంచ్ చేస్తారని ఆయన తెలిపారు.

సేవలు సమర్థవంతంగా అందిస్తే మెరుగైన ఫలితాలు

రాష్ట్ర ప్రణాళికా శాఖ ప్రతినిధి శ్రేయాఘోష్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఈస్ట్ బాపట్ల గ్రామ సచివాలయాన్ని రాష్ట్ర ప్రణాళికా శాఖ ప్రతినిధి శ్రేయాఘోష్ సందర్శించారు. రాష్ట్రంలో గ్రామ సచివాలయాలు ద్వారా అమలవుతున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు అర్హులైన పేదవారికి ఎలా అందుతున్నాయని పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటన కోసం గురువారం బాపట్ల వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక రకాల సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన పేదవారికి అందుతున్నాయా లేదా అనే విషయాన్ని గ్రామ సచివాలయంలోని అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బందిని పలురకాలుగా ప్రశ్నించి సమాచారాన్ని సేకరించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు, రైతులు కౌలు దారులు కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మహిళా ,శిశు సంక్షేమం కోసం ఏర్పాటైన అంగన్వాడీ కేంద్రాల పనితీరు , గ్రామ సచివాలయాల ద్వారా పౌరులకు అందించే సేవలు పారదర్శకంగా జరుగుతున్నాయా ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారనే విషయాల గురించి శ్రేయ ఘోష్ నిశితంగా పరిశీలించారు.సిబ్బంది తమ సేవలను సమర్ధవంతంగా అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అయినంపూడి శ్రీనివాసరావు, గణాంకాధికారి వాణి, ఉపగణాంక అధికారి దాసరి శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కళాపరిషత్ నాటిక పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర - మార్టూరు : శ్రీకారం రోటరీ కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో కళాపరిషత్ నాటిక పోటీలను గురువారం ఘనంగా ప్రారంభించారు. నాటిక పోటీలు ప్రారంభం రోటరీ గవర్నర్ కె.శరత్ చౌదరి పరిషత్ కార్యదర్శి జాస్తి అనురాధతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో రోటరీ అధ్యక్షులు మద్దుమల కోటేశ్వరరావు కార్యదర్శి మాదాల సాంబశివరావు పాల్గొన్నారు. మొదటి ప్రదర్శనగా న్యూ స్టార్ మోటర్ థియేటర్ విజయవాడ వారి కపిరాజు నాటిక రెండవ ప్రదర్శనగా రససురి పొన్నూరు వారి గురితప్పిన వేట నాటిక మూడవ ప్రదర్శనగా యంగ్ థియేటర్ విజయవాడ వారి 27వ మైలురాయి నాలుగవ ప్రత్యేక ప్రదర్శన శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారి 50 కోట్లు ఆ తర్వాత అనే నాటికలు ప్రదర్శించారు. నాటికల్లోని సన్నివేశాలు ప్రేక్షకులకు ఎంతగానో అలరించాయి ఆలోచింపచేశాయి.

సేవా కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర - పర్చూరు : సమరసత సేవా ఫౌండేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించారు. తొలుత భారత మాతకు పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ సాయిరాం మాట్లాడుతూ హిందూ ధర్మం విశ్వ జనీయం ప్రపంచ శాంతిని కోరుకుంటున్నదని, హిందూ ధర్మం సనాతన మైనదని భగవద్గీత ప్రపంచంలో అత్యుమైన గ్రంథం మానవాళికి మార్గదర్శి అని, రామాయణం మానవ నడవడికను తెలియజేసి కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుంది అని తెలిపారు. కార్యక్రమంలో కొల్లా సుబ్బారావు, తులసి భిక్షాలు, రామాంజనేయులు, చంద్రయ్య, లక్ష్మీ నాదాచార్యులు, అడపాల కృష్ణ, తులసి అప్పారావు, తులసి శివ నాగేశ్వర రావు, రమణాచార్యులు, లెక్కింశెట్టి లక్ష్మారావు, అన్నమనేని వెంకటేశ్వర్లు, సత్యం (అష్టలక్ష్మి దేవాలయం), పర్చూరు ఖండ్ ధర్మ ప్రచారక్ తులసి రాజేష్, సమరసత సేవ ఫౌండేషన్ గ్రామ ధార్మిక సమితి కన్వీనర్లు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు జైలు

విశాలాంధ్ర - బాపట్ల : గంజాయి ఇతర మత్తు పదార్ధాలను విక్రయించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు.బాపట్ల జిల్లా చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో పట్టుబడిన గంజాయి కేసులోని నిందితులకు గురువారం గుంటూరు మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఏ.ఎల్ సత్యవతి 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10,000 నగదు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. గంజాయి కేసులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

జనసేన మౌన దీక్ష

విశాలాంధ్ర-ఒంగోలు: జమ్ము కాశ్మీర్ లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి ఖండిస్తూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ప్రకాశం జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఒంగోలు లోని పార్టీ కార్యాలయం లో జనసేన పార్టీ పక్షాన మృతులకు సంఘీభావంగా మౌన దీక్ష చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులు గా ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్,రవిశంకర్ గ్రూప్ అధినేత, ప్రకాశం జిల్లా జనసేన నాయకులు కంది రవిశంకర్ హాజరయ్యారు,ఈ కార్యక్రమం లో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, రాయని రమేష్,కృష్ణ పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలు బొందిల శ్రీదేవి, ఒంగోలు నగర జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పిల్లి రాజేష్, ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్ల ప్రమీల, దండే అనిల్, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శులు గోవింద్ కోమలి, ఆకుపాటి ఉష,ఒంగోలు నగర సంయుక్త కార్యదర్శి సుంకర కళ్యాణి,36వ డివిజన్ అధ్యక్షులు అయినాబత్తిని రాహుల్,9వ డివిజన్ అధ్యక్షులు నరసింహారావు,3వ డివిజన్ అధ్యక్షురాలు షేక్ ముంతాజ్, 19వ డివిజన్ అధ్యక్షులు ఇమ్మడిశెట్టి శ్రీను,16వ డివిజన్ అధ్యక్షులు అల్లూరి శ్రీహరి, ఉపాధ్యక్షులు కర్రి శ్రీకాంత్,10వ డివిజన్ అధ్యక్షులు తెళ్ల హరీష్,5వ డివిజన్ అధ్యక్షులు శ్రీ హరి,కార్యక్రమల కమిటీ సభ్యులు బొందిల మధు,జనసేన నాయకులు కాసాని వాసు, కోట మనోహర్,మొహమ్మద్ యూనిస్,ఆరిగ శివ,పాలు, శ్రీను, సాయి మరియు వీర మహిళ నక్క ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర- చీమకుర్తి: ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం గాడిపత్రివారి పాలెం గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఒంగోలు డివిజన్ పంచాయతీ అధికారి పద్మ, చీమకుర్తి మండల డిప్యూటీ ఎంపీడీవో అజిత, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శాంతి ప్రియ, ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామ సభలో గ్రామాభివృద్ధికి కావలసిన పనులు గ్రామ సమస్యలు పై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమం కు గ్రామ సర్పంచి చల్ల కొలుసుల అయ్యవీరయ్య, పంచాయతీ కార్యదర్శి సుశీల, సచివాలయ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్ రంపతోటి శివాజీ, గ్రామ నాయకులు వేణు, ప్రసాద్, వెంకటరావు, కృష్ణారావు, రామాంజనేయులు,ప్రజలు పాల్గొన్నారు.

దూబగుంట్లకు ఉత్తమ పంచాయతీ అవార్డు



విశాలాంధ్ర-పామూరు రూరల్ : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలలో భాగముగా మండలంలోని దూబగుంట్ల పంచాయతీ ఉత్తమ సేవా పురస్కార్ అవార్డుకు ఎంపికైంది. ఒంగోలు మల్లయ్య లింగం భవనం నందు గురువారం జరిగిన కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర టూరిజం శాఖ చైర్మన్ నూకసాని బాలాజీల చేతుల మీదుగా అవార్డును ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసులు రెడ్డి అందుకున్నారు.

పెహల్గాం ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : జమ్మూ కాశ్మీర్ లోని పహిల్గావ్‌లో జరిగిన దాడి హేయమైన చర్య అని జనసేన పార్టీ రేపల్లె నియోజకవర్గం సమన్వయకర్త మత్తి భాస్కరరావు అన్నారు. జరిగిన సంఘటనకు నిరసనగా గురువారం సాయంత్రం ఐలాండ్ సెంటర్ నుండి పార్టీ శ్రేణులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి నుదుటిన తిలకం దిద్దినట్ల ఉండే అందమైన కాశ్మీరులో ఉగ్రవాదులు టూరిస్టులపైన దాడులు చేయటం పాశవికమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు దూళ్ళ సురేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మల్లాది రామకృష్ణ, జనసేన నాయకులు యెల్లెల రవికిరణ్, హనుమంతరావు, వుల్లగుంట శ్రీనివాసరావు, ఎల్లెల భాస్కరరావు, దేగల సుబ్బారావు, చిమతా సదాశివరావు, బోడపాటి రమేష్, విసా విజయ్, అన్నం నాగరాజు,పోటుమెరక శ్రీనివాసరావు, తలాడి వెంకటేశ్వరరావు, కొటారి వాసు, జిడుగు రాముడు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో.....

జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని బాపట్ల పట్టణంలోని చీల్‌రోడ్ కామ్రేడ్ చీవుకుల శేష శాస్త్రి స్తూపం వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వద్దకు కార్యకర్తలతో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ మానవహారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల మారణకాండలో అసువులు బాసిన 26 మంది భారతీయులకు ఆత్మకి శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. పేహల్గాం లో 26 మందిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి పొట్టన బెట్టుకున్న ఉగ్రవాదులను సరైనా రీతిలో ప్రతీకారం త్వరలోనే ఉంటుందని అభిప్రాయపడ్డారు.ఉగ్రదాడిలో తెలుగు వారు మృతి చెందడం బాధాకరం అన్నారు. శాంతి ర్యాలీలో పాల్గొన్న అందరి చేత భారత్ మాతాకీ జై అంటూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు బాపట్ల మున్సిపల్ కమీషనర్ నిర్మల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి,మందపాటి ఆంధ్రయ, కారుమూరి ఆంజనేష్, ఎమ్.ఎస్. శేషుకృష్ణ, చిలకల సురేంద్ర, దగ్గుమల్లి రాణి, కాగిత నాగభూషణ కుమారి, ముక్కామల శివ, వడ్డమూడి వెంకటేశ్వరరావు, మాడసాని బాలాజీ, సలగల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో....

దేశంలోని జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో పెహల్గాం ప్రాంతంలో అమాయకులైన పర్యాటకులను అమానుషంగా మన దేశ సైనికుల వేషధారణలో వచ్చి ఉగ్రదాడులు చేసి ప్రాణాలను హరించడం హేయమని చీరాల నియోజకవర్గ శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. చీరాల గడియార స్తంభం కూడలి వద్ద కొవ్వొత్తులు వెలిగించి శాంతియుత నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగున ఉన్న దాయాది దేశం పాకిస్థాన్ ఇటువంటి చర్యలను మానుకోవాలని హితవు పలికారు. మతం చూసి దాడి చేయడం దారుణమన్నారు. ఉగ్రదాడుల్లో అసువులు బాసిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతులకు నివాళిగా మౌనం పాటింప చేశారు. తెలుగు దేశం, జన సేన, భారతీయ జనతా పార్టీల నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో పోషక్ పక్వాడ్ వారోత్సవాలు

విశాలాంధ్ర-ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పోషక్ పక్వాడ్ వారోత్సవాలు నిర్వహించారు. వారం రోజుల పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు విద్యార్థులకు పోషకాహారంపై సెమినార్ నిర్వహించారు. ఆ తర్వాత వారి ఎత్తు, పొడుగు తదితర అంశాలు పరిశీలించి ఎలాంటి ఆహారం తీసుకోవాలి అని న్యూట్రిషనిస్ట్ ద్వారా తెలియజేశారు. మూడో రోజు క్విస్ తదితర పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో పోషక్ పక్వాడ్ యాప్ ని డౌన్ లోడ్ చేయించి, దాని ద్వారా ఎలాంటి ఆహారం తీసుకోవచ్చో తెలుసుకోవచ్చని ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు తెలియజేశారు. అనంతరం వెంగముక్కపాలెం లోని ప్రజలకు ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఏ ఆహారం తింటే ఆరోగ్యంగా ఉంటారు తదితర అంశాల్లో విద్యార్థులు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఉన్న కాలంలో పోషకాహారం తినకపోవడం, ఏ ఆహారం తినాలో తెలియక చాలామంది జబ్బుల బారిన పడుతున్నారని, అలాంటి సమయంలో ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి చర్య అని విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. ప్రతి ఒక్కరు మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతరావు, ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, శిరీష, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రామారావుకు ఉత్తమ నాయకత్వ సేవా పురస్కారం



విశాలాంధ్ర-సంతనూతలపాడు : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలలో భాగముగా మండలంలోని చంద్రపాలెం గ్రామ సర్పంచ్ బొద్దు రామారావు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కార్ అవార్డును ఎంపిక కావడంతో ఒంగోలు మల్లయ్య లింగం భవనం నందు గురువారం జరిగిన కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత రాష్ట్ర టూరిజం శాఖ చైర్మన్ నూకసాని బాలాజీలు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకల కార్యక్రమానికి గ్రామ స్వరాజ్ సాధన సమితి నేషనల్ లోకల్ ప్రభుత్వ చాంబర్ జాతీయ కార్యదర్శి జి వీరభద్రాచారి అధ్యక్షతన జరిగింది. పంచాయతీ కార్యదర్శి మౌనిక పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాలకొండయ్యకు నివాళులు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని కంబాలదిన్నె తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు బెల్లం మాలకొండయ్య ఇటీవల మృతి చెందారు. గురువారం బెల్లం మాలకొండయ్య దశదినకర్మ జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ రావు, ఒంగోలు పార్లమెంటు టిడిపి కార్యదర్శి యస్. డి ఆమీర్ బాబు,యూనిట్ ఇంఛార్జ్ ఇర్రి కోటిరెడ్డి,మోపాడు రిజర్వాయర్ నీటి సంఘ చైర్మన్ చుంచు కొండయ్య, మండల తెలుగుదేశం అధ్యక్షులు మన్నం రమణయ్య, గోళ్ళ మాల్యాద్రి, గోళ్ళ భాస్కరరావు,గళ్ళ చెన్నయ్య, సానుమూరి వెంకటేశ్వర్లు, ఏలూరి నరసింహారావు తదితరులు పాల్గొని బెల్లం మాలకొండయ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

రుద్రరాజు గృహ ప్రవేశంలో 'బొల్లా'

విశాలాంధ్ర-పామూరు రూరల్ : కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో గురువారం రుద్రరాజు నూతన గృహప్రవేశం చేశారు. ఈ వేడుకకు లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, మద్ద రమణయ్యలు హాజరై రుద్రరాజు కుటుంబ సభ్యులను ఆశీర్వదించి శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు.

మార్టూరు సమగ్రాభివృద్ధికి కృషి

- ఇంటింటికి కుళాయితో మంచినీరు
- మార్టూరులో చెత్త సేకరణకు రిక్షాలు
- పంచాయతీలో చెత్తబుట్టల పంపిణీ
- సులభ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో

ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - మార్టూరు : మార్టూరు పంచాయతీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపై స్పష్టమైన అవగాహన ఉందని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం మార్టూరు గ్రామపంచాయతీ పరిధిలోని నూతన సులభ్ కాంప్లెక్స్ ను ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్స వాన్ని పురస్కరించుకొని గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ రిక్షాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటికి చెత్తబుట్టలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పర్చూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అన్ని రంగాలను అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం పాలనలో రాష్ట్రం విధ్వంసానికి గురైందన్నారు. రాష్ట్రంలో కోట్లాది రూపాయల పనులను ఎక్కడికక్కడ నిలిపివేశారని, దీంతో అభివృద్ధి పూర్తిగా నిలిచిందన్నారు.రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో చంద్రబాబు పనులను ప్రారంభిస్తే ఆ పనులు అన్నిటిని రద్దుచేసి అభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మన పర్చూరు నియోజకవర్గంలో 300 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు నిలిపివేసిన ఘనత వైసిపి దేనన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మళ్ళీ ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నిలిచిన అభివృద్ధిని కొనసాగించేందుకు రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దానని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. రాబోయే మూడేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా మార్టూరు పట్టణంలో ప్రజలకు ఉపయోగపడేలా సులభ్ కాంప్లెక్స్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మార్టూరుకు చెందిన శ్రీరామ్ రామయ్య గోవిందమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీరామ్ శేషగిరిరావు మార్టూరులో వాటర్ ప్లాంట్ కు రూ 2 లక్షల విరాళంను ఏలూరి చేతుల మీదుగా అందజేశారు. రాష్ట్ర మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్ జనార్దన్ కొండవు ఆదినారాయణ, శివ నాగేశ్వరరావు తాటి నాగేశ్వరరావు పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసరావు నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జాతి పిత మహాత్మ గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా ఎంపీడీవో పి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందుతే దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలను పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని ,సిబ్బందిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఆయా గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. ఎంపీడీవో కార్యదర్శి సిబ్బంది సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రదాడులకు నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జమ్ము కాశ్మీర్ రా ష్ట్రంలో మినీ స్విట్జ ర్లాండ్‌గా పిలిచే పెహ ల్గాంలో జవాన్ల డ్రెస్సు లు ధరించి వచ్చిన ఉగ్రవాదులు పర్యాట కులను లక్ష్యంగా చేసుకుని 28 మందిని పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో చీరాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ చీరాల గడియార స్తంభం కూడలి నుండి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తిస్తూ ఉగ్రదాడికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని మండుల దుకాణ యజమానులు షాపులను సాయంత్రం మూసి వేసి సంఘీభావం ప్రకటిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. వీహెచ్ పీ సభ్యులు, ఆర్ ఎస్ ఎస్ సభ్యులు, చీరాల గో పరిరక్షణ సమితి సభ్యులు, భారతీయ జనతా పార్టీ సభ్యులు, జన సేన పార్టీ, టీడీపీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సంతాప దీక్ష

విశాలాంధ్ర - రేపల్లె : జమ్మూకాశ్మీర్ పహల్గాం లో ఉగ్రదాడులకు ప్రాణాలు కోల్పోయిన వారికి సంఘీభావంగా జనసేనపార్టీ అధ్వర్యంలో రేపల్లె తాలూకా సెంటర్‌లో సంతాప దీక్ష నిర్వహించారు.ఈ సంతాప దీక్ష కార్యక్రమంలో జనసేన పార్టీ రేపల్లె నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. జనసేనపార్టీ రేపల్లె పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ మాట్లాడుతూ భారతదేశ గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా కక్ష్య పూరితంగా అతి దుర్మార్గంగా పాకిస్థాన్ తీవ్రవాదులు ఈ దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. భారతదేశం ప్రపంచ దేశాల్లో ఎంతో ప్రాముఖ్యమైన దేశమని అన్ని దేశాలు ఇష్టపడే దేశం భారతదేశమన్నారు. ప్రపంచ దేశాల్లో అహింసా మార్గంలో ముందుకు వెళ్ళే దేశం భారతదేశం అయితే, హింసాత్మక దాడులే అజెండాగా అన్ని దేశాలకు ప్రధాన శత్రువుగా కనపడుతున్న ఏకైక దేశం పాకిస్థాన్ అని దుయ్యబట్టారు.ఉగ్రదాడులలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంఘీభావంగా గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ సంతాప దీక్ష చేశారు.ఈ దీక్షకు మద్దతుగా రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదులు, మొబైల్ షాప్స్ యూనియన్ నాయకులు, శిబిరానికి వచ్చి సంతాపం తెలిపారు.ఈ సంతాప దీక్షల్లో కూనపరెడ్డి జగదీష్, దేవగిరి శంకర్, గరికపాటి గిరిధర్, మెండు సుబ్బారావు, మలిశెట్టి సాయి, కాజా నాగేశ్వరరావు, వడ్డి వెంకటేశ్వరరావు, దేవరపల్లి గురు బ్రహ్మ, పరిశా రాజు, ఈపూరి సురేష్, లోయ వెంకట శ్రీను, చింతయ్య, మొగదాసు శ్రీకాంత్ పాల్గొన్నారు.

31 వరకు అపరాల కొనుగోలు కేంద్రాలు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : అపరాల కొనుగోలు కేంద్రాలను మే 31 వరకు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ తెలిపారు. ఇప్పటివరకు 116 మంది రైతుల వద్ద నుండి 1675 క్వింటాళ్ల అపరాలను ప్రభుత్వం కొనుగోలు చేసిందని ఇంకా ఆసక్తి ఉన్న రైతులు తమ అపరాలను కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవచ్చని తెలియజేశారు. పెసలు క్వింటాల్ 8682 మినుములు క్వింటా 7400 ప్రభుత్వం ధర నిర్వహించిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : డి2 స్టూడియో ఆధ్వర్యంలో దేశాయిపేట పంచాయితీ ఆమోదగిరి పట్నంలో మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి రోజున ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్నామని, ప్రతి ఆదివారం మజ్జిగ పంపిణీ ఉంటుందని తెలిపారు. మిగిలిన రోజులలో వేసవి దాహార్తిని తీర్చేందుకు చల్లని మంచినీరు పంపిణీ చేస్తామని అన్నారు. చిరంజీవి, కిరణ్ కుమార్, షేక్ హాబీబ్, రవి కుమార్, పన్నెం శ్రీనివాస్, విజయ్ ,ధనుష్, దేవన్న పాల్గొన్నారు.

దేవరపును పరామర్శించిన బొల్లా

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని మోపాడుకి చెందిన టీడీపీ నాయకులు దేవరపు మాల్యాద్రి బెంగళూరులో వైద్య చికిత్సలు పొందుచున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి గురువారం బెంగళూరులో మాల్యాద్రి ని పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఎంపీడీవో వి.ప్రద్యుమ్న కుమార్

విశాలాంధ్ర - పర్చూరు : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో వి.ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందుతే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా వారి మన్ననలు పొందాలని అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలను పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ప్రతినెలా పంపిణీ చేసే పెన్షన్లు ఎలాంటి ఫిర్యాదులు లేకుండా లబ్ధిదారులకు సకాలంలో పంపిణీ చేయాలని తెలిపారు. సిబ్బందిపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఆయా గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లా అంజమ్మ, ఎంఈఓ 2 వెంకట్రామయ్య, ఏపీ ఓ రమేష్, సీనియర్ అసిస్టెంట్ పి.నారాయణ రావు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కేవలం జీతం కోసమే కాకుండా గ్రామ ప్రజల అవసరాల కోసం ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలకు ప్రతి ఒక్కరు అభినందనలు తెలపాలని చెరుకుపల్లి పంచాయతీ కార్యదర్శి ఈపూరు విజయబాబు అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఉద్యోగి సెలవు తీసుకున్న ఉన్నవారిలో ఎవరో ఒకరు ఆ సెలవు తీసుకున్న ఉద్యోగి విధులు నిర్వహిస్తారని కానీ పారిశుద్ధ్య కార్మికులు సెలవు పెడితే గ్రామాలు మురికి కూపాలుగా మారుతాయని అందుచేత వారు విరామం లేకుండా పనిచేస్తారని ఒకవేళ అతను సెలవు పెట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయ కార్మికుడిని పనిలో పెట్టి సెలవు పెడతారని ఆయన అన్నారు. అలాంటి వారిని సత్కరించుకోవడం మన బాధ్యత అన్నారు. అనంతరం కార్మికులకు దృశ్యాలువలు పూలమాలతో ఘనంగా సత్కరించారు. పంచాయతీ సర్పంచ్ దేవరకొండ వాణి పంచాయతీ పాలక మండలి సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం నుంచి విముక్తి కల్పించాలి

ఏపీఎం కోటేశ్వరరావు



విశాలాంధ్ర - అద్దంకి : స్థానిక వెలుగు కార్యాలయం నందు గురువారం మండల సమాఖ్య సమావేశం జరిగింది. ఏపీఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ నిరుపేదలను పేదరికం నుంచి విముక్తి కలిగించేందుకు సమాఖ్యసభ్యులు కృషి చేయాలన్నారు. పి4 విధానం ద్వారా నిరుపేదలను పేదరికం నుంచి విముక్తి కలిగించేందుకు చేపట్టవలసిన కార్యక్రమాల గురించి సభ్యులకు వివరించారు. మండల సమాఖ్య కార్యకలాపాల గురించి చర్చించారు. సిసిలు బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.